క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్



కలెక్టర్‌కు నియామక పత్రాన్ని చూపుతున్న మొగల్ నూరుల్లా

కదిరి అర్బన్: శ్రీ సత్యసాయి జిల్లా వక్ఫ్‌బోర్డు నూతన అధ్యక్షునిగా నియమితులైన కదిరి పట్టణానికి చెందిన మొగల్ నూరుల్లా బుధవారం పుట్టపర్తిలో జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నియామక పత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు చూపించారు. జిల్లాలో వక్ఫ్‌బోర్డు భూములు అన్యాక్రాంతం కాకుండా చూస్తానని నూరుల్లా తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఓడీ చెరువు: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ ఫర్వీన్‌బాను అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పోలప్ప బుధవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని పిలుపునిచ్చారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

ఓడీ చెరువు: మండలంలోని జీవన్ జ్యోతి ఆశ్రమ పాఠశాలలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన ఓడీ చెరువు, నల్లమాడ, అమడగూరు మండలాల్లో మహిళా సంఘసభ్యులకు మూడవ విడత వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రాజునాయుడు, టౌన్ కన్వీనర్ కోళ్ల క్రిష్టారెడ్డి బుధవారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



మేళాలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

ధర్మవరం: పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు మంచి స్పందన వచ్చిందని ప్రిన్సిపాల్ మునల్ రెడ్డి తెలిపారు. తృతీయ సంవత్సరం చదువుతున్న 70 మంది విద్యార్థులకు వీకేర్ ఫార్మ కంపెనీ తదితర కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించి అందులో 19 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

స్వామియే శరణమయ్యప్ప



అయ్యప్పస్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని చెరువుకట్టవద్ద నున్న శ్రీ అయ్యప్పస్వామి భజన మందిరంలో బుధవారం ఓనం గురుస్వామి అంబటి సతీష్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి జయంతి వేడుకలను భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. అయ్యప్పస్వామి చిత్రపటాలకు అలంకరణ గావించి భజనలు చేశారు. అయ్యప్పస్వామి భక్తులు పెద్ద ఎత్తున భజన మందిరానికి చేరుకుని స్వామికి పూజలు చేశారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

కదిరి టౌన్: కదిరి తూర్పు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ముత్యాలవాండ్లపల్లి, బి.యర్రబల్లి, కొవ్వూరువాండ్లపల్లి, బొమ్మిరెడ్డిపల్లిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ అనురాధ తెలిపారు. ఏప్రిల్ 6 నుంచి 12 వరకు కదిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయనికి చేర్చి రసీదు పొందాలన్నారు. 10వ తరగతి పాస్ అయివుండాలని, అంగన్వాడీ కేంద్రం ఉన్న గ్రామం మజరా స్థానికులే అర్హులన్నారు. వయసు 21 నుంచి 35 మధ్య ఉండాలన్నారు. పదో తరగతి మార్క్స్ కార్డు, పుట్టిన తేదీ, ఆధార్ జతపరచాలన్నారు.

ధర్మవరం ఐసీడీఎస్ పరిధిలో..

ధర్మవరం అర్బన్: ధర్మవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ లక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6వతేది నుంచి 12వతేదిలోపు అర్హులైన దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అంగన్వాడీ వర్కర్ పోస్టు ఎల్‌సీకేపురం-1లో-1(పీహెచ్), హెల్పర్ పోస్టులు మల్లేనిపల్లిలో 1(ఎస్సీ) చిగిచెర్ల-1లో 1(ఓసీ), బడన్నపల్లి-1లో 1(ఓసీ), సంజయ్‌నగర్‌లో 1 (బీసీ-డీ) చొప్పున ఉన్నాయని తెలిపారు.

చెన్నేకొత్తపల్లి: ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ కవితాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. రామగిరి మండలంలో అంగన్‌వాడీ కార్యకర్త గరిమేకలపల్లి బీసీ-సి, చెన్నేకొత్తపల్లి మండలం గొల్లవాండ్లపల్లి బీసీ-ఈ, అంగన్‌వాడీ హెల్పర్లు రామగిరి మండలం రెడ్డివారిపల్లి ఓసీ, తిమ్మాపురం(మెయిన్) బీసీ-డీ, గరిమేకలపల్లి (మెయిన్) ఎస్సీ, చెన్నేకొత్తపల్లి మండలం ప్యాదిండి(మెయిన్) బీసీ-బీ, ముష్టికోవెల (మెయిన్) ఓసీ, కనుముక్కల బీసీ-డీ దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మహిళలను ముంచిన చంద్రబాబు



హాజరైన స్వయం సహాయక సంఘాల సభ్యులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

- ఒక్క రూపాయి కూడా మాఫీ చేయకుండా మోసం
- ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి ధ్వజం
- వైఎస్సార్ ఆసరా సంబరాలకు పోటెత్తిన అక్కచెల్లెమ్మలు

కదిరి అర్బన్: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2014 ఎన్నికల్లో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఒక్క రూపాయి కూడా మాఫీ చేయకుండా మహిళా సంఘాలను ముంచేశాడని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం పట్టణంలో మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. పెద్ద ఎత్తున హాజరైన అక్కచెల్లెమ్మలకు రూ. 5,29,71,000 మెగా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మూడు విడతలుగా రాష్ట్ర వ్యాప్తంగా రూ.19 వేల కోట్లు మహిళల ఖాతాల్లో జమచేశారని పేర్కొన్నారు. నాలుగవ విడత 6 వేల కోట్ల రూపాయలు కూడా రాబోవు ఎన్నికల ముందే అందజేస్తారని చెప్పారు. సున్నా వడ్డీకూడా మహిళల ఖాతాల్లో జమచేస్తున్నారని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట మీద నిలబడే వ్యక్తి అన్నారు. కరోనాతో ప్రపంచదేశాలు సైతం ఇబ్బందులు పడే క్రమంలో మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలను అందజేశారని గుర్తు చేశారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్లను తీసుకువచ్చి సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ అందజేస్తున్నారని పేర్కొన్నారు. ఏ గ్రేడ్‌లో ఉన్న మహిళా సంఘాలను చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చాక బీ, సీ గ్రేడ్‌లలోకి నెట్టేశారని పేర్కొన్నారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. స్వాతంత్య్ర ఉద్యమ నేత బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ రాధాబాయ్, ఎంపీడీఓ సుధామణి, వెలుగు ఏపీఎం శారదారెడ్డి, ఈఓఆర్డీ అంజనప్ప, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రకాష్, మాజీ సర్పంచ్ ఇంద్రప్రసాద్ రెడ్డి, సచివాలయాల కన్వీనర్ లింగాల మధుసూదన్ రెడ్డి, వైఎస్ ఎంపీపీ ఆనంద్‌నాయక్, ఎస్టీసెల్ నాయకులు కృష్ణానాయక్, వెలుగు సీసీ బాబ్జాన్, వివిధ శాఖల చైర్మన్‌లు, సర్పంచులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

నేడు నల్లచెరువులో..

నల్లచెరువు: మండల కేంద్రంలోని కే.పూలకుంట రోడ్డులో ఉన్న గీతామందిరంలో మండలంలోని డ్వాక్రా మహిళలకు ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి చేతుల మీదుగా మూడో విడత వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును గురువారం పంపిణీ చేయనున్నట్లు ఎంపీపీ కె.రమణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు హాజరు కావాలని ఆయన కోరారు.

సంక్షేమాన్ని ప్రజలకు వివరిద్దాం



బుక్‌లెట్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- ఎల్లోమీడియా, ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొడదాం
- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పిలుపు

పుట్టపర్తి: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం జగన్ చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిద్దామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. ఆయన బుధవారం పుట్టపర్తి పార్టీ కార్యాలయంలో ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమ బుక్‌లెట్లు విడుదల చేసి విలేకరులతో మాట్లాడారు. ఈ నాలుగేళ్లలో ఇచ్చిన హామీలలో 90 శాతం అమలు చేశారన్నారు. ప్రతి ఇంటిలో ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి పొంది ఉంటారన్నారు. లబ్ధి పొందని కుటుంబాలను గుర్తించాలన్నారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేసే కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నేరుగా నగదు రూపంలో లబ్ధిదారులకు ప్రయోజనం సమకూర్చామని ప్రజలకు వివరించాలన్నారు. సీఎం జగన్ ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేసి పేదల కడుపు నింపారని, గతంలో టీడీపీ నేత మాజీ సీఎం చంద్రబాబు నాయుడు ధనికులకు మేలు చేసి పేదల కడుపు కొట్టారని ఎమ్మెల్యే విమర్శించారు. నియోజకవర్గంలో అన్ని మండలాలు, గ్రామ సచివాలయాల కన్వీనర్లు, గ్రామ స్థాయి నాయకులను కలుపుకొని కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. తాను ప్రతి మండలంలో ఎక్కడో ఒక చోట పాల్గొంటానన్నారు. 20 రోజుల పాటు కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి సిద్దరాంపురం కేశప్ప, అమడగూరు ఎంపీపీ ప్రసాద్ రెడ్డి, ఓడీచెరువు జెడ్పీటీసీ దామోదర్‌రెడ్డి, నల్లమాడ కన్వీనర్ కుళ్లాయినాయక్, స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివశంకర్‌రెడ్డి, నాయకులు షామీర్‌బాష, గంగిరెడ్డి, ఆయా మండలాల పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

ధర్మవరం అర్బన్: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు పాటుపడిన ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్ అని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా బుధవారం ఆయన విగ్రహానికి యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ పట్టణ నాయకులు రామకృష్ణనాయక్, ఆంజనేయులు, లక్ష్మయ్య, రాంప్రసాద్, బిల్లే రామంజినేయులు, హెచ్ రామాంజినేయులు, ఆదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం: పట్టణంలో జగ్జీవన్‌రామ్ 116వ జయంతిని పురస్కరించుకుని మున్సిపల్ పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు, కార్మికులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు పుల్లన్న, బాబు, చెన్నకేశవులు, లక్ష్మీ ఓబిలేసు, ప్రసాద్, ముకుంద, శ్రీనివాసులు, బాలమురళి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

- విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పులిచెర్ల వేణుగోపాల్, పట్టణ కార్యదర్శి దేవరకొండ రామానుజులు, సత్సంగ ప్రముఖ్ ఘంటసాల వెంకటేశ్వరప్రసాద్, ఆనంద్ తదితరులు జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

తాడిమర్రి: స్థానిక ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం దళితుల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు బండారు రామాంజినేయులు ఆధ్వర్యంలో ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, తిరుపాల్, నారాయణ, మహిళలు పాల్గొన్నారు.

ఓడీ చెరువు: దళితుల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని ఎంపీడీఓ పోలప్ప అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ, బీసీ కాలనీలో బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ఎం.ఎస్.షబ్బీర్ తదితరులు బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ గజ్జెల శ్రీనివాసరెడ్డి, వెంకట్‌నారాయణ, నరసింహులు, మహబూబ్ బాష, అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు: మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలిలో జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలను వేసి నివాళులర్పించారు. దళిత సంఘం నాయకులు తోపు పారేసు మాట్లాడుతూ ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, శ్రీనివాసులు, చిన్నప్ప, నరేష్, ప్రసాద్‌నాయక్, సురేష్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతికి ఎనలేని కృషి

కొత్తచెరువు: దళితుల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన మహనీయుడు జగ్జీవన్ రామ్ అని మాల మహానాడు నాయకుడు సోదనపల్లి రామాంజినేయులు తెలిపారు. బుధవారం విజయనగర కాలనీలోని ఆర్‌డీటీ పాఠశాలలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు మిఠాయిలను పంచిపెట్టారు. కార్యక్రమంలో చంద్రాయుడు, ఓబులేసు, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లమాడ: బాబూ జగ్జీవన్‌రామ్ 116వ జయంతి వేడుకలను బుధవారం స్థానిక స్వాతి క్లినిక్‌లో ఆర్ఎంపీ బుట్టి నాగభూషణ్‌నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పథకాలు అందాలి

గాండ్లపెంట: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క లబ్ధిదారునికీ అందాలని వైఎస్సార్ సీపీ కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కురుమామిడి, వేపరాల, సోమయాజులపల్లి, మలమీదపల్లి గ్రామ సచివాలయాల పరిధిలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంపై గ్రామ వలంటీర్లు, గృహసారథులు, సచివాలయాల కన్వీనర్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో సర్పంచ్‌లు సుధాకర్, శాంతమ్మ, ఎంపీపీ తాతం జగన్మోహన్, జెడ్పీ కోఆప్షన్ ఫయాజ్‌అలీ, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, ఆర్బీకే చైర్మన్ శంకర్‌నాయుడు, బీసీ కన్వీనర్ నరసింహాగౌడ్, ఆయా గ్రామాల వలంటీర్లు, గృహసారథులు, సచివాలయాల కన్వీనర్‌లు, గ్రామస్థాయి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లాలి

కొత్తచెరువు: ప్రభుత్వ పథకాల లబ్ధిపై ప్రతి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడాలని మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ ఛాంబర్‌లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంపై వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ భర్త సింగిల్ విండో మాజీ అధ్యక్షులు రెడ్డప్పరెడ్డి, జెడ్పీటీసీ భర్త మటన్ శంకర్, సచివాలయాల మండల కన్వీనర్ సాంబశివారెడ్డి, సర్పంచ భర్త నాగరాజు, ఉపాధ్యక్షురాలు సరళ, సింగిల్ విండో అధ్యక్షులు నాగభూషణ, టౌన్ కన్వీర్ భాస్కర్, సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం

నల్లచెరువు: అల్లుగుండు, పి కొత్తపల్లి, ఎం అగ్రహారం, పంతులచెరువు, ఉబిచర్ల, కె పూలకుంట సచివాలయాల పరిధిలో ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి ఆదేశాల మేరకు ఎంపీపీ కె.రమణారెడ్డి బుధవారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాల గురించి చర్చించారు. ఎంపీపీ మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కలిసి సమన్వయంతో పని చేయాలన్నారు. జగనన్న ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కిట్లను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నారాయణస్వామి, జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్, సర్పంచులు శ్రీనాథ్ రెడ్డి, యూసుఫ్, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు జయచంద్రారెడ్డి మాజీ ఎంపీటీసీ రమణ, మాజీ సర్పంచులు అక్బర్, సుధాకర్ నాయకులు వై.రమణారెడ్డి, సానే హరినాథ్‌రెడ్డి, నాగభూషన్ యాదవ్, క్రిష్టారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేద్దాం

పుట్టపర్తి: ప్రతి కార్యకర్త, నాయకులు 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని బుక్కపట్నం ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు.ఆయన బుధవారం మండల పరిధిలోని మారాల,కృష్ణాపురం, గౌనికవారిపల్లి తదితర గ్రామ పంచాయతీలలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, జిల్లా యూత్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి,మారాల సొసైటీ అధ్యక్షుడు రమణారెడ్డి, వైస్ ఎంపీపీ ఆఇనారాయణ, విశ్రాంత టీచర్ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ కేశవనాయకుడు మండల అగ్రిఅడ్వైజరీ బోర్డు చైర్మన్ వెంకటచౌదరి, నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గజవాహనంపై లక్ష్మీ చెన్నకేశవస్వామి

తాడిమర్రి: మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవంలో భాగంగా బుధవారం స్వామి వారిని గజవాహనంపై ఊరేగించారు. ముందుగా ఆలయంలోని మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పూలమాలలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

నేడు రథోత్సవం

స్థానిక లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం నిర్వహిస్తున్నారు. డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ తాడిమర్రి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఉత్సవాలను నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేశారు. సుమారు 70 ఏళ్ల తర్వాత రూ.25 లక్షలు ఖర్చు చేసి నూతన రథాన్ని తయారు చేయించారు. రథోత్సవంలో చిన్నారులతో చెక్క భజన, కీలు గుర్రాలు, మరగాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వృషభాలతో రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. ఉదయం 7 గంటలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ తదితర వరుసగా ఏడింటికి రూ.35 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు నగదు బహుమతులను ఇవ్వనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. రథోత్సవంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభిస్తారని డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. భక్తుల కోసం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



తాడిమర్రిలో స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

నేడు పోతుకుంటలో ఎమ్మెల్యే పర్యటన

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని పోతుకుంట గ్రామంలో గురువారం ఉదయం 10 గంటలకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ నాయకులు గుర్రం శ్రీనివాసరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కోఆప్షన్‌సభ్యులు, మండల కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఆర్టీసీ సిబ్బందికి కంటి పరీక్షలు

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీలో బుధవారం అనంతపురం నగరానికి చెందిన అక్బర్ కంటి ఆసుపత్రి వైద్యులు ఆర్టీసీ ఉద్యోగులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ఔట్‌సోర్సింగ్‌సిబ్బంది మొత్తం 180 మందికి పరీక్షలు చేశారు. దృష్టిలోపం ఉన్నవారికి కంటి అద్దాలను రాయించారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచిత హెల్త్ స్కీం కింద ఆపరేషన్లకు సిఫారసు చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు నిజాముద్దీన్, డీఎం మైనొద్దీన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'మార్పు రావాలి'



నాటకాన్ని ప్రదర్శిస్తున్న సభ్యులు

బత్తలపల్లి: ఆడపిల్ల భారమని భావించి పెళ్లిళ్లు చేసే తల్లిదండ్రులకు కనువిప్పు కలిగించేలా ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మార్పు రావాలి' వీధి నాటకం పలువురిని ఆకట్టుకుంది. బుధవారం బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆసుపత్రి, నాలుగు రోడ్ల కూడలిలోని గంగమ్మ ఆలయం వద్ద 8 మంది కళాకారులు నాటకాన్ని ప్రదర్శించారు. ఆడపిల్లలను పుట్టనిద్దాం..ఎదగనిద్దాం.. గౌరవిద్దాం అంటూ నినాదాలు చేశారు. ఏటీఎల్ రుక్మాంగద, కల్చరల్ ఆర్గనైజర్‌లు శ్యాంసన్ తదితరులున్నారు.

త్వరితగతిన బైపాస్ పూర్తి చేయాలి

కదిరి అర్బన్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం బైపాస్ రోడ్డు నిర్మాణంపై ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ఆర్డీఓ రాఘవేంద్రతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బైపాస్ రోడ్డు పరిధిలోని భూమిని త్వరగా కాంట్రాక్టర్‌కు అధికారులు అప్పగించాలని ఆదేశించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. త్వరితగతిన రోడ్డు పూర్తి చేసేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్ఐ మున్వర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పరీక్షల విభాగం కార్యదర్శి

నల్లమాడ మండలం యర్రవంకపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోమగుట్ట భాస్కర్‌రెడ్డిని సత్యసాయి జిల్లా డిస్ట్రిక్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు(డీసీసీబీ) కార్యదర్శిగా నియమించినందుకు బుధవారం ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగరాజు, వరప్రసాద్‌రాజు,మల్లు శ్రీధర్‌రెడ్డి,విశ్వనాథ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాసులు, జంషీద్,జమీర్, అలీ తదితరులున్నారు.

నివాళి..

కదిరి టౌన్: స్వాతంత్ర్యోద్యమ నేత, సంస్కరణవాది బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా బుధవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి లింగాల లోకేశ్వర్‌రెడ్డి కార్యాలయంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కె.ఎస్ బహుద్దీన్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

పోస్టర్ల విడుదల

కదిరి ఎమ్మెల్యే కార్యాలయంలో 'జగనన్నే మా భవిష్యత్తు' పోస్టర్లను ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి బుధవారం విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికలకు ఏడాది సమయం మాత్రమే ఉన్నందున నిరంతరం ప్రజల మధ్యనే ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ లింగాల మధుసూదన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పరికి సాదిక్, శంకర్, ధనుంజయ,కన్వీనర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

కదిరి అర్బన్: పట్టణంలోని ఎన్జీఓ హోంలో బుధవారం ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం కదిరి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కదిరి మండల అధ్యక్షునిగా బాలాజీనాయక్, ప్రధాన కార్యదర్శిగా ఇంద్రావత్ రామూనాయక్, గౌరవాధ్యక్షులుగా శివశంకర్‌నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శంకర్‌నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రామానాయక్, ట్రెజరర్‌గా సుభాష్‌నాయక్‌తో పాటు మరికొంతమందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఏపీ ప్రధాన కార్యదర్శి చత్రే నాయక్, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులునాయక్, ప్రధాన కార్యదర్శి కాలేనాయక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సత్యసాయినగర్‌కు చెందిన శ్రీదేవి కుటుంబ కలహాలతో బుధవారం ఇంట్లో చీరతో ఉరివేసుకునే ప్రయత్నం చేసింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని భర్త...

పట్టణంలోని ఎరగుంటలో వెంకటేష్, శాంతమ్మ దంపతులు కుటుంబ కలహాలతో గొడవపడ్డారు. బుధవారం భార్య శాంతమ్మ పుట్టింటికి వెళ్లిపోగా మనస్తాపం చెందిన భర్త వెంకటేష్ ఇంట్లో ఉన్న తలకు వేసుకునే హెయిర్ డై పొడర్‌ను నీళ్లలో కలుపుకుని తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు గమనించి వెంటనే అతనిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

9న ఉచిత కంటి వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కోట మున్సిపల్ పాఠశాలలో ఈనెల 9వతేది నిర్వహించనున్న ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రోటరీక్లబ్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి జయసింహ, కాంప్రు చైర్మన్ నాగభూషణ తెలిపారు. స్థానిక సాంస్కృతిక మండలిలో బుధవారం వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు నరేంద్రరెడ్డి, రత్నశేఖర్‌రెడ్డి, శివయ్య, రమేష్‌బాబు, సుదర్శన్‌గుప్త, సోలిగాళ్ల వెంకటేషులు, సాంస్కృతిక మండలి వ్యవస్థాపకులు సత్రసాలప్రసన్నకుమార్,హరినాథ్,మురళి తదితరులున్నారు.

నాయీ బ్రాహ్మణేతరులకు అనుమతి ఇవ్వొద్దు

పుట్టపర్తి: నాయీ బ్రాహ్మణేతరులకు బార్బర్ షాపులు పెట్టుకునేందుకు అనుమతులివ్వరాదని జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు.

పేటెంట్ హక్కు కల్పించాలి

కదిరి అర్బన్: క్షవరవృత్తికి పేటెంట్ హక్కు కల్పించాలని బుధవారం ఆర్డీఓ రాఘవేంద్రకు పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం సమర్పించారు.